

గోదావరి కళాక్షేత్రంగా నామకరణం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగర ప్రజల నుంచి వచ్చిరన అభ్యర్ధనల మేరకు రాజాట్యాంకు ఆవరణలో నిర్మించిన ఆడిటోరియంకు గోదావరి కళాక్షేత్రంగా తిరిగి నామకరణం చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఉత్తర్వులు మంగళవారం జారీ చేశారు. మున్సిపల్ కార్పోరేషన్ రికార్డులలో ప్రస్తుతం శ్రీ రాగిరెడ్డి వెంకట జయరామ్‌కుమార్ కళాక్షేత్రంగా ఉందని, అయితే గతంలో ఈ ఆడిటోరియంకు గోదావరి కళాక్షేత్రంగా ఉండేదన్నారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఆ ఆడిటోరియంకు తిరిగి గోదావరి కళాక్షేత్రంగా నామకరణం చేసేందుకు ప్రతిపాదించిన తీర్మానానికి నగర ప్రత్యేకాధికారి, కలెక్టర్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఇంకా ఎదురుచూపులే..!

- నేటికీ ప్రారంభం కాని డిగ్రీ అడ్మిషన్లు
- ఆన్‌లైన్‌లోనా..ఆఫ్‌లైన్‌లోనా.?
- సిలబస్ మార్పులతోనే ఆలస్యమా.!
- ఎన్నాళ్ళీ నిరీక్షణ

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఇంటర్ ఫలితాలు విడుదలై 3 నెలలు అయింది. విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్ల కోసం అప్పటినుంచి ఎదురు చూస్తూనే ఉన్నారు. కానీ ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియ వ్యవహారం ఎటూ తేల్చడం లేదు. గతంలో మాదిరిగా అడ్మిషన్లు చేస్తారా..? లేకపోతే ఆన్‌లైన్‌లోనా, ఆఫ్‌లైన్ ద్వారా నిర్వహిస్తారా? అనేది స్పష్టత లేకుండా పోయింది. దీంతో వందలాది మంది ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరాలనుకుంటున్న విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. మరోవైపు పలు ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలలో అనధికారికంగా డిగ్రీ తరగతులు నిర్వాహణ సాగిపోతున్నాయి.

జిల్లాలో తుని, తొండంగి, పిఠాపురం, ఏలేశ్వరం, జగ్గంపేట, కాకినాడ ఉమెన్స్, పిఠాపురం రాజా (పిఆర్), పెద్దాపురంలో మహారాణి, కాకినాడ ఎంఎస్ఎన్ ఛార్టిస్ ఎయిడెడ్ కళాశాలల్లో సుమారు 7 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరంతా బిఎ, బిఎస్‌సి, కెమిస్ట్రీ, బికాం, కంప్యూటర్స్ తదితర ఆనర్స్ కోర్సులను అభ్యసిస్తున్నారు. అలాగే పలు ప్రయివేట్ డిగ్రీ కళాశాలలు వీటికి తోడుగా ఉన్నాయి. వీటిల్లో మరో 10 వేల మంది వరకూ చదువుతున్నారు.



కాకినాడలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు

వాస్తవానికి ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలైన వెంటనే డిగ్రీ అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. సప్లమెంటరీ పరీక్షా ఫలితాలు వెలువడినప్పటికీ ఈ విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల వ్యవహారంపై స్పష్టత రాలేదు. గత వైసిపి ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలోనే డిగ్రీ అడ్మిషన్లను చేపట్టింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది విద్యార్థుల సిలబస్‌కు సంబంధించి ఉన్నత విద్యామండలి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతానికి సింగిల్ మేజర్ విధానంలో సిలబస్‌ను అమలు పరుస్తున్నారు. అయితే సిలబస్‌లో మార్పులు తీసుకురావాలనే చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఇటీవల అమరావతిలో జరిగిన ఉన్నత విద్యామండలి సమావేశంలో డిగ్రీ మొదటి ఏడాదిలో డబుల్ మేజర్ విధానంలో పాఠ్యాంశాలు ప్రవేశపెట్టాలనే అంశంపై చర్చ జరిగినట్లు సమాచారం. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ మిషన్ కోర్సుల అమలుపై సమీక్ష జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. ఆఫ్‌లైన్‌లో అడ్మిషన్లు ప్రక్రియ చేపట్టే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలుస్తోంది. అందుకోసమే నెలల తరబడి ఆలస్యం అవుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. సబ్జెక్టు విధానాన్ని త్వరితగతిన తేల్చి అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రయివేట్ కళాశాలలు జోరు

జిల్లాలో పలు ప్రయివేట్ కార్పొరేట్ కళాశాలలో ఇప్పటికే ఇంటర్ పూర్తియిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి పెట్టుకున్నాయి. కొన్ని కళాశాలల యాజమాన్యాలు అయితే ఫీజులు సైతం కొంత మొత్తంలో వసూలు చేసి సిద్ధంగా ఉన్నాయి. అడ్మిషన్ల ప్రక్రియను ప్రభుత్వం మొదలు పెట్టిన అనంతరమే విద్యార్థులు కోరుకున్న కోర్సుల్లో అవకాశం ఇచ్చేందుకు సన్నద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు గణనీయంగా తగ్గిపోతాయని, ఓ వైపు ఆయా కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, మరోవైపు తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


తక్షణమే అడ్మిషన్లు జరపాలి



ఇప్పటికే ఇంటర్ పూర్తయి డిగ్రీ అడ్మిషన్ల కోసం మూడు నెలలుగా ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం వెంటనే అడ్మిషన్లు ప్రక్రియను చేపట్టాలి. ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ విధానంలో వెంటనే అడ్మిషన్లు జరిపి పాఠ్యాంశాలు బోధించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి.

-ఎం.కరుణకుమార్, విద్యార్థి, కాకినాడ

తగ్గిపోయే అవకాశం



అడ్మిషన్ల ప్రక్రియలో నేటికీ స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు పలు ప్రయివేట్ కళాశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు సంఖ్య తక్కువగా ఉంది. ఇప్పుడు మరింత ఆలస్యం చేస్తుండడంతో విద్యార్థుల సంఖ్య ఇంకా తగ్గే అవకాశం ఉంది.

-పి. ప్రసాద్, విద్యార్థి, కాకినాడ

సమ్మె జయప్రదం చేయాలని ఆటో ప్రచారం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్, కాకినాడ, సామర్లకోట

కాకినాడ రూరల్ మండలం వలసపాకల సెంటర్లో ఆటో జాతాను సిఐటియు నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్, సివిల్ అండ్ మెకానిక్ యూనియన్ వీరభద్రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి తొట్టిపూడి రాజా మాట్లాడారు. బుధవారం జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రచార జాత కోరమండల్, ఇండియన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం, ప్యారి షుగర్, వలసపాకల, వాకలపూడి, పండూరు, తిమ్మాపురం, గైగోలపాడు, సూర్యారావుపేట పంచాయతీల్లో ప్రచారం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు పరిశ్రమ కార్మికులు శ్రీహరి, రాంబాబు, నాగేంద్ర, రాంబాబు, రామకృష్ణ, అప్పలరాజు, శ్రీను, వీరబాబు, చంద్రశేఖర్, ధనుష్, కృప, సాయి, రాజు, సివిల్ అండ్ మెకానిక్ యూనియన్ కార్మికులు బుజ్జి, శ్రీను, రమేష్ పాల్గొన్నారు.

సమ్మెకు సిపిఎం నగర కమిటీ మద్దతు

బుధవారం జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సిపిఎం నగర కమిటీ సంపూర్ణ మద్దతు తెలియ చేస్తున్నట్లు నగర కమిటీ కన్వీనర్ పలివెల వీరబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత కార్మిక వర్గ పోరాటాలకు ఘనమైన చరిత్ర ఉందన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే నాలుగు లేబర్‌కోడ్లను వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు చేస్తున్న సార్వత్రిక సమ్మెను ఉద్యోగ, కార్మిక, కర్షక, మేథావులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


కాకినాడ రూరల్‌లో ప్రచారం చేస్తున్న సిఐటియు నేతలు

సార్వత్రిక సమ్మెకు ఎపిఆర్‌పిఎ మద్దతు

కేంద్ర కార్మిక, కర్షక, రైతు సంఘాలు సంయుక్తంగా బుధవారం నిర్వహిస్తున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు ఎపి ఆర్‌పిఎ మద్దతు ఇస్తుందని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కావున రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కమిటీల బాధ్యులు కేంద్ర కార్మిక సంఘాలు నిర్వహించే ప్రదర్శనలలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

నేడు కార్మిక ప్రదర్శన

నేడు సామర్లకోట పట్టణంలో జరిగే సమ్మె సందర్భంగా కార్మిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు సిఐటియు మండల అధ్యక్షులు బాలన్ శ్రీనివాస్ చెప్పారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక మెహర్ కాంప్లెక్స్ వద్ద నున్న భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం నుంచి బల్లమార్కెట్ సెంటర్ వరకు కార్మికుల ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ ప్రదర్శనలో పెద్దఎత్తున కార్మికులు, ఉద్యోగులు, కర్షకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

సమన్వయంలో నియోజకవర్గ అభివృద్ధి

ప్రజాశక్తి - పెద్దాపురం

నియోజకవర్గ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో విజన్-2047 లక్ష్య సాధనపై సమన్వయ సమావేశం జరిగింది. ఆర్‌డిఒ శ్రీరమణి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో రోడ్లు, రహదారులు, తాగునీరు, సాగునీరు, వ్యవసాయ అభివృద్ధి, ఉపాధి కల్పన వంటి అంశాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి పి-4లో నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, పెద్దాపురం, సామర్లకోట మున్సిపల్ కమిషనర్లు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీవిద్య, తహశీల్దార్లు సిహెచ్.వెంకటలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిడిఒ శ్రీలలిత, ఎపిఒ సుధీర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ చినరాజప్ప

రోడ్డుకు తాత్కాలిక మోక్షం

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని కాట్రావులపల్లి హైస్కూల్ జంక్షన్ నుంచి సూరంపాలెం వెళ్ళే రోడ్డుకు తాత్కాలిక మోక్షం కలిగింది. పెట్రోల్ బంక్ జంక్షన్ నుంచి గ్రామం వరకు పెద్ద, పెద్ద గుంతలు పడటంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. గ్రామ టిడిపి అధ్యక్షులు ముసిరెడ్డి నాగేశ్వరరావు మంగళవారం తన సొంత సొమ్ములు వెచ్చించి ఆ రోడ్డులో మెటల్ వేసి గుంతలను పూడ్పించారు. దీంతో రోడ్డుకు మరమ్మతులు చేయించిన నాగేశ్వరరావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.


రహదారికి మరమ్మతులు చేయిస్తున్న టిడిపి నాయకులు

కలుషిత నీటితో డయేరియా

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వాతావరణంలో మార్పు, కలుషిత నీరు, పులిచిన ఆహారం తీసుకోవడం వలన డయేరియా వచ్చే అవకాశం ఉందని పిఎంపి వైద్యులు కుమారయాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాధారణ పరిస్థితిలో వచ్చే విరోచనాలు కాకుండా అతి తరచుగా వస్తే వైద్యులను సంప్రదించాలని అన్నారు. నీటితోపాటు లవణాలు, విటమిన్లు బయటికి పోతాయి గనుక పండ్లు అధికంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం బీపీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, అడబాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్‌లో సిఆర్‌టి-డి ఇన్‌ప్లాంటేషన్ సేవలు

ప్రజాశక్తి - కాకినాడ

హృద్రోగులకు ప్రపంచ స్థాయి చికిత్సను అందించాలనే లక్ష్యంతో మెడికవర్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక కార్డియాక్ రీసింక్రొనైజేషన్ థెరపీ డిఫిబ్రిలేటర్(సిఆర్‌టి-డి) ఇంప్లాంటేషన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆసుపత్రి యాజమాన్యం వెల్లడించింది. మంగళవారం మెడికవర్ హాస్పటల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ మాత శ్రీనివాస్ మాట్లాడారు. గుండె వైఫల్యంతో బాధపడుతున్న, గుండె లయ సమస్యలు ఉన్న రోగులకు ఈ అధునాతన చికిత్స గొప్ప ఆశాదీపంగా నిలుస్తుందన్నారు. సిఆర్‌టి-డి అనేది ఒక ప్రత్యేకమైన పరికరమని అన్నారు. ఇది గుండె యొక్క గదుల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచడానికి, గుండె యొక్క పంపింగ్ సామర్థ్యాన్ని పెంచడానికి సహాయపడుతుందన్నారు. గుండె వైఫల్యం యొక్క లక్షణాలను తగ్గిస్తుందన్నారు. జీవన నాణ్యతను మెరుగుపరచటమే కాకుండా ఆకస్మిక గుండె ఆగిపోయే ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుందని తెలిపారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ ప్రణవ్ మాట్లాడుతూ కాకినాడ ప్రజలకు అత్యాధునిక కార్డియాక్ కేర్‌ను అందించడంలో తాము ముందంజలో ఉన్నామన్నారు. గుండె వైద్య నిపుణులు డాక్టర్ కూరాకుల నరేష్ మాట్లాడుతూ సిఆర్‌టి-డి వ్యాధిగ్రస్తులైన వారి హృదయాల సామర్థ్యాన్ని పెంచటమే కాకుండా రక్త ప్రవాహాన్ని పెంచుతాయన్నారు. మెడికవర్ హాస్పిటల్స్ కాకినాడ సెంటర్ హెడ్ శుభకరరావు మాట్లాడుతూ సిఆర్‌టి-డి ఇంప్లాంటేషన్ సేవలను ఇప్పటికే ఇద్దరికి అందించినట్లు తెలిపారు. తమ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన కార్డియాలజిస్టులు, కార్డియాక్ సర్జన్ల బృందం ఉందని, తమ వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

ఘనంగా వైఎస్ఆర్ జయంతి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో మాజీ సిఎం వైఎస్.రాజశేఖర్ రెడ్డి జయంతిని వైసిపి శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో మాజీ సిఎం వైఎస్ఆర్ జయంతిని వైసిసి శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. రాయవరంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, మొగలి అయ్యారావు, గంధం నాగేశ్వరావు, జ్యోతుల భీముడు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్‌పిటిసి సభ్యులు వెంకట సుబ్బారావు, వైసిపి సర్పంచులు పిల్లి కృష్ణమూర్తి, వనం సూర్యవతి, పోతురాజు ప్రసన్నమౌనిక, గంజా దేవి, గుంటూరు అప్పారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. **జగ్గంపేట** మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ఆర్ జయంతి కార్యక్రమాలు జరిగాయి. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తోట నరసింహం, మాజీ ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు, వైసిపి నాయకుడు ఒమ్మి రాఘురామ్ వేర్వేరుగా ఆయన జయంతిని నిర్వహించారు. ఆయా కార్య క్రమంలో జడ్‌పిటిసి ఒమ్మి బిందుమాధవి, సర్పంచ్‌లు బోధిరెడ్డి చక్రరావు, నకిరెడ్డి నాగేశ్వరరావు, మాజీ ఉప సర్పంచ్ బండారు రాజా, పార్టీ మండల అధ్యక్షులు రావుల గణేష్‌రాజా, పాల్గొన్నారు. **కాకినాడ రూరల్** సంతోష్ నగర్‌లోని రెడ్‌క్రాస్ వృద్ధుల ఆశ్రమంలో వైసిపి రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి, రామశర్మ దంపతుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. వృద్ధులకు అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించారు. ఈ కార్ర్యక్రమంలో కొప్పుశెట్టి శివ, గుత్తుల సూర్యప్రకాశరావు, సుభాష్ పాల్గొన్నారు. **పత్తిపాడు** స్థానిక లయన్స్ క్లబ్‌లో వైఎస్ ఆర్ జయంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని పిఎసి సభ్యులు ముద్రగడ పద్మనాభం ప్రారం భించారు. అలాగే ఓమ్మంగిలో మండల కన్వీనర్ రామిశెట్టి నాని ఆధ్వర్యంలో వైఎసఆర్ విగ్రహానికి ముద్రగడ గిరిబాబు పూలమాలలు వేసి పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గోళ్ళ కాంతిసుధాకర్, జడ్‌పిటిసి బెహరా రాజ రాజేశ్వరి, సర్పంచ్‌లు తుమ్మల భవాని, గుడాల విజయలక్ష్మి, వైసిపి నాయకులు పాల్గొన్నారు. **పెద్దాపురం** పట్టణ, మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో వైఎస్ఆర్ జయంతిని నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సెంటర్లో వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. కాండ్రకోట, కట్టమూరు, తదితర గ్రామాలలో వైఎస్ ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **సామర్లకోట** పట్టణంలోని జగనన్న కాలనీ, రాజీవ్ గృహకల్ప, రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పై ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు ఊబా జాన్‌మోజేష్, నెక్కంటి సాయి ప్రసాద్, వైసిపి నాయకులు దవులూరి సుబ్బారావు, ఆవాల లక్ష్మీనారాయణ, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు. **రౌతులపూడి** మండలంలోని పలు గ్రామాలలో వైఎస్ఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. రౌతులపూడిలో వైసిపి మండల కన్వీనర్ చింతకాయల వీర వెంకట సత్యానారాయణ, జడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, వైసిపి నాయకులు వాసిరెడ్డి జమీలు వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **కరప** మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్ఆర్ జయంతిని వైసిపి నాయకులు ఘనంగా నిర్వమించారు. కరపలో వైఎస్ఆర్ విగ్రహానికి మండల వైసిపి అధ్యక్షుడు చింత ఈశ్వరరావు, జడ్‌పిటిసి వై.సుబ్బారావు, ఎంపిపి పెంకె శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి పూలమాలలు వేసి నివాళులర్పించారు.


ప్రత్తిపాడులో చీరలు పంపిణీ చేస్తున్న గిరిబాబు


సామర్లకోటలో నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

1717 పేద కుటుంబాల దత్తత: కలెక్టర్

ప్రజాశక్తి - పెద్దాపురం

జిల్లాలో 1717 పేద కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగిందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పి-4 కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని వడ్లమూరు గ్రామంలో ఒక నిరుపేద కుటుంబాన్ని కలెక్టర్ సన్మోహన్ సగిలి దత్తత తీసుకున్నారు. గ్రామంలోని దొండపాటి చార్లెస్‌కు చెందిన ఐదుగురు సభ్యులతో ఉన్న నిరుపేద కుటుంబాన్ని ఆయన దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కుటుంబానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అన్ని సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. జిల్లావ్యాప్తంగా అధికార యంత్రాంగం 1717 కుటుంబాలను దత్తత తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీరమణి, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, ఎంపిడిఒ శ్రీలలిత, సర్పంచ్ దేవళ్ల దుర్గావరలక్ష్మీదేవి, అధికారులుపాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధిపై వైసిపి నేతలు బహిరంగ చర్చకు సిద్ధమా అని జనసేన నేతలు సవాల్ చేశారు. మంగళవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎల్ఎ పంతం నానాజీ, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు మాట్లాడారు. నియోజకవర్గానికి పవన్ కళ్యాణ్ ఎన్నిసార్లు వచ్చారు అని ప్రశ్నించే వారికి అభివృద్ధితోనే సమాధానం చెబుతామన్నారు. ఏడాది కాలంలో రూ.308 కోట్లను నియోజకవర్గ అభివృద్ధికి కేటాయించి పనులు చేస్తున్నట్లు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గం అభివద్దే లక్ష్యంగా పవన్ కళ్యాణ్ పని చేస్తున్నారన్నారు. అటువంటి నాయకుడిపై విమర్శలు చేయడం దారుణమన్నారు. ఈ సమావేశంలో నాయకులు వేగుళ్ల లీలాకృష్ణ, తోట సుధీర్, మురాలశెట్టి సునీల్, చల్లా లక్ష్మి, ఊటా నానిబాబు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతిపై శిక్షణ

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని పంచాయతీల పురోగతిపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం జరుగుతుందని ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ రామలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే ఈ శిక్షణా కార్యక్రమానికి మండల స్థాయి అధికారులతోపాటు, సచివాలయ సిబ్బంది సకాలంలో హాజరుకావాలని సూచించారు.

ఫౌండేషన్‌కు రూ.2 లక్షల విరాళం

ప్రజాశక్తి - జగ్గంపేట

జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్‌కు భూపాలపట్నం ప్రసాద్ కుమారుడు వెంకట రాకేష్ రూ.2 లక్షల విరాళాన్ని అందించారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కు విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వెంకట రాకేష్ మాట్లాడుతూ చార్టెడ్ అకౌంట్‌గా ఉద్యోగం సాధించిన నేపథ్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ కు 2 లక్షలు విరాళాన్ని అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట రవి, భూపాలపట్నం సర్పంచ్ వీరారెడ్డి కాశిబాబు, టిడిపి నాయకులు తోట గాంధీ, ప్రియతమ్ తేజ పాల్గొన్నారు.

11న టెలీ కాలర్ ఉద్యోగాల కోసం జాబ్ డ్రైవ్

ప్రజాశక్తి - కాకినాడ

స్థానిక జగన్నాధపురంలోని ఎఎస్‌డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ధరిత్రి అడ్వైజరీ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ టెలీ కాలర్ ఉద్యోగాల కోసం ఈ నెల 11న జాబ్ డ్రైవ్ నిర్వహిస్తోందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనంతలక్ష్మి మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ ఉద్యోగానికి అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులు కాకినాడలోని కార్యాలయంలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. నెలకు రూ.8 వేలు వేతనం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నిషేధిత ఉత్పత్తుల అమ్మకాలపై తనిఖీలు

ప్రజాశక్తి - కాజులూరు

నిషేధిత ఉత్పత్తుల విక్రయాలపై విస్తృత తనిఖీలు చేస్తున్నట్లు గొల్లపాలెం ఎస్ఐ ఎం.మోహన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెం, ఆర్యవటం, చేదువాడ, కాజులూరు గ్రామాల్లో పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాసంస్థలు ఉన్న 100 మీటర్ల లోపు ఏవిధమైన మత్తు పదార్థాలు విక్రయించరాదని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను దిక్కరించి విక్రయాలు చేస్తే ఖఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో గొల్లపాలెం స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన

ప్రజాశక్తి - యంత్రాంగం

తుని రాష్ట్రంలో సంక్షేమం అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంగళవారం పట్టణంలోని 11, 12, 13 వార్డుల్లో ప్రభుత్వ విప్, తుని ఎంఎల్ఎ యనమల దివ్యతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని అన్నారు. ఎలాంటి రాజకీయ జోక్యం, పైరవీలు, షరతులు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు, సూపర్ సిక్స్ హామీలను ఆగస్టు నెలలోగా 80-90 శాతం అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు, కూటమి నాయకులు యనమల రాజేష్, ఇన్నిగంటి సత్యనారాయణ, కుసుమంచి శోభారాణి, నార్ల భవనసుందరి, చింతమనేడు అబ్బాయి, అంకమ్మ రెడ్డి రమేష్, గాడి రాజబాబు తదితరులు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలంలోని నవర గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్, ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పాల్గొన్నారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోళ్ళ వెంకటరమణ నిమ్మకాయల రంగనాగ్, పాలకుర్తి శ్రీనుబాబు, తోటకూర శ్రీనివాస్, పెంకె వెంకటేష్, ముసిరెడ్డి శ్రీరాములు పాల్గొన్నారు. **పెద్దాపురం** పట్టణంలోని 18వ వార్డులో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు ఆధ్వర్యంలో జరిగింది. ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రంది సత్యనారాయణ, తూతిక రాజు, తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడ్డం పెద్దకాపు, నాయకులు మహమ్మద్ ఆరిఫ్ ఆలీ, యాళ్ల వీరబాబు, పాల్గొన్నారు. అలాగే ఆనూరు గ్రామంలో మాజీ సర్పంచ్ సింగన అరవిందకుమార్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. **పిఠాపురం** మండలంలోని చిత్రాడ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ ఎన్.వర్మ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో క్లస్టర్ ఇన్‌ఛార్జ్ జాస్తి వసంత్ అధ్యక్షతన గండేపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొల్లంరెడ్డి రామకృష్ణ, పైల వెంకన్న, సుంకుపల్లి రమేష్ పాల్గొన్నారు.


సామర్లకోట సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి


తునిలో ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి - యంత్రాంగం

పచ్చదనంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమౌతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి అన్నారు. మంగళవారం మండలంలోని వడ్లమూరు గ్రామంలో ఉపాధి హామీ చట్టం నిధులతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రంమలో కలెక్టర్ పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీరమణి, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, ఎంపిడిఒ శ్రీలలిత, సర్పంచ్ దేవళ్ల దుర్గావరలక్ష్మిదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. మండలంలోని 23 గ్రామాల్లో మొక్కలు నాటినట్లు ఎపిఒ సుధీర్ తెలిపారు. **కాజులూరు** మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జె.రాంబాబు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** మండలంలోని వనపూడి గ్రామంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ ఇ.రామలక్ష్మి, తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ సునీల్‌కుమార్, జనసేన నాయకులు భవిరిశెట్టి రాంబాబు, దొడ్డిపట్ల తిరుపతిరావు, మొయిళ్ళ వీర రాఘవులు, సిబ్బంది పాల్గొన్నారు. **యు.కొత్తపల్లి** మండలంలోని శ్రీరామ్‌పురంలో పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్ మొక్కలు నాటారుఉ. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవికుమార్, సర్పంచ్ రావి రమేష్, నాయకులు మురాలశెట్టి సునీల్‌కుమార్, జ్యోతుల శ్రీనివాస్, ఎపిఒ కొండలరావు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **ఏలేశ్వరం** మండలంలోని సిరిపురం, భద్రవరం, లింగంపర్తి గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో ఎంపిపి గొల్లపల్లి బుజ్జి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు జ్యోతుల పెదబాబు, చిక్కాల లక్ష్మణరావు, దనేకుల సత్యనారాయణ, నూకతాటి ఈశ్వరుడు, పెంటకోట మోహన్, మండల ఉద్యానవన అధికారి దివ్యశ్రీ పాల్గొన్నారు. **కరప** మండలంలోని గొర్రిపూడి గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అనుపమ పాల్గొని మొక్కలను నాటారు. అలాగే పెనుగుదురులో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బండారు మురళి మొక్కలు నాటారు. గొడ్డటిపాలెంలో సర్పంచ్ గోన అనూష మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని పోలేకురులో నిర్వహించిన వన మహోత్సవంలో ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు పాల్గొని మొక్కలు నాటారు. ఈ పథకంలో ఎకరం విస్తీర్ణంలో మొక్కలు నాటడానికి ఏడాదికి రూ.76,687 ఉపాధి హామీ చట్టం ద్వారా అందిస్తున్నట్లు డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.రామకృష్ణ, వైస్ ఎంపిపి నాగేంద్రప్రసాద్, ఎంపిడిఒ కె.సత్యనారాయణ, ఎపిఒ ఎస్. తేజస్వి, టిడిపి నాయకులు బుజ్జిబాబు, లక్ష్మణరావు, గంగ సూర్యనారాయణ, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలోని జెడ్.రాగంపేట పిహెచ్‌సి ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ జ్యోతుల నెహ్రూ పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతుల మోహనరావు, కందుల చిట్టిబాబు, కొత్త కొండబాబు, మారిశెట్టి భద్రం, అడబాల భాస్కరరావు, జాస్తి వసంత్, పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ ప్రణీత్, ఎంపిడిఒ కర్రిచంద్రరావు, కార్యదర్శి తరంగిణి, ఎపిఒ కృష్ణంరాజు, పాల్గొన్నారు.



పెద్దాపురంలో మొక్కను నాటుతున్న కలెక్టర్

10న మెగా పేరెంట్స్, టీచర్స్ డే

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 10 వ తేదీన మెగా పేరెంట్స్, టీచర్స్ డే నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ చౌదరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని 80 ప్రభుత్వ, 38 ప్రయివేటు పాఠశాలల్లో ఈ వేడుకలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రగతి, విద్యార్థుల విద్యాభివద్ధి తదితర అంశాల సమీక్షిస్తారని ఆయన తెలిపారు.

నేరాలు ఘోరాలు

బైకుల చోరీపై కేసుల నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో రెండు ప్రాంతాల్లో రెండు బైకులు చోరీకి గురైన ఘటనపై మంగళవారం కేసులు నమోదయ్యాయి. పట్టణంలో ఇందిరమ్మ కాలనీకి చెందిన గోడా సుందర్ సింగ్ అనే వ్యక్తి 15 రోజుల క్రితం మోటార్ సైకిల్ ఇంటిదగ్గర పార్కింగ్ చేసి విజయవాడ బంధువుల ఇంటికి వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చేసరికి మోటార్ సైకిల్ చోరీకి గురైనట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు సిఐ పి.విశ్వం తెలిపారు. సుందర్ సింగ్ ఫిర్యాదు పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అవంతి ఫీట్స్ ఫ్యాక్టరీ గేటు ఎదురుగా ఉన్న ప్రాంతంలో బొల్లా కనకదుర్గ ప్రసాద్ అనే వ్యక్తి మోటార్ సైకిల్ సోమవారం రాత్రి చోరీకి గురైంది. ఇంటి బయట పార్కింగ్ చేసిన మోటార్ సైకిల్ తెల్లవారు లేసి చూసేసరికి కనిపించడం లేదని బాధితుడు ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎఎస్‌ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో 13వ వార్డుకు చెందిన చింతా సూర్యనారాయణ ఈనెల మూడో తేదీ నుంచి కనిపించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ పి.విశ్వం తెలిపారు. కొంతకాలంగా ఊపిరితిత్తుల సమస్యతో సూర్యనారాయణ హైదరాబాదులో చికిత్స పొందుతున్నట్లు అతని సోదరి లావేటి రమణ తెలిపారు. మూడో తేదీ ఉదయం రాజమహేంద్రవరం వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని రమణ మంగళవారం ఫిర్యాదు చేసిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. వ్యక్తి ఆచూకీ తెలిసినవారు 9440796622కు సమాచారం ఇవ్వాలన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు

జూన్ 28వ తేదీ రాత్రి కొవ్వూరు పట్టణ శివారున కృష్ణారావు చెరువు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని 108 వాహనంలో రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ ఎం.దుర్గారావు తెలిపారు. విఆర్‌ఒ కుందేటి మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్నిరాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు ఆయన తెలిపారు. మృతుడు బిచ్చగాడిగా భావిస్తున్నట్లు తెలిపారు. అతని వివరాలు లభ్యం కాలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి -భర్త, ఇద్దరు పిల్లలకు గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా, ఆమె భర్త, ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఇంజరం గ్రామానికి చెందిన దడాల చంద్రశేఖర్ భార్య, ఇద్దరు చిన్నారులతో మోటారు సైకిల్‌పై కాకినాడ ఆసుపత్రికి బయలుదేరారు. పటవల వచ్చే సమయానికి వెనక నుంచి ఆయిల్ ట్యాంకర్ ఢీ కొట్టడంతో భార్య దడాల ఝాన్సీరాణి(28) అక్కడికక్కడే మృతి చెందగా, భర్త చంద్రశేఖర్ పెద్ద కుమారుడు అభినవ్ దీక్షిత్, ఐదు నెలల రెండో కుమారునికి స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన ముగ్గురిని 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోరంగి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. కోరంగి ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారాతో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ పరిధిలోని కుమ్మర వీధిలో నాటు సారా విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం జరిగిన ఈ దాడిలో గుబ్బల వీరఆదివిష్ణును సారాతో అరెస్ట్ చేసినట్లు సిఐ రామ్మోహనరావు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వెల్లడించారు. ఈ దాడుల్లో కాకినాడ నార్త్ ఎస్‌ఐ ఎంవిబి.కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

11 కేజీల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరం సర్కిల్ పోలీసులు దాడి చేసి 11 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. సిఐటి టి.గణేష్ తెలిపిన వివరాల మేరకు కడియం సిఐ వెంకటేశ్వరరావు, ధవళేశ్వరం ఎస్‌ఐ హరిబాబు, ఈగల్ టీమ్‌తో కలిసి ఈ ఆపరేషన్ నిర్వహించామని సిఐ గణేష్ తెలిపారు. ధవళేశ్వరంలోని స్థానిక పివిఆర్ లే-అవుట్‌లో కొంతమంది వ్యక్తులు పెద్ద మొత్తంలో గంజాయిని కలిగి ఉన్నారనే సమాచారంతో పోలీసులు వెంటనే అప్రమత్తమయ్యారు. వెంటనే బృందాలుగా ఏర్పడి దాడి చేసి ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి 11 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు. గంజాయి వంటి నిషేధిత పదార్థాల విక్రయం, రవాణా చట్టరీత్యా నేరమని, అలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇరువురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - కొవ్వూరు

పట్టణంలో శ్రీనివాసపురం పెట్రోల్ బంక్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. రాజమహేంద్రవరం వైపు వెళున్న ఆటోను వెనుక వస్తున్న బివిసి కళాశాల బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తాళ్లపూడికి చెందిన ఆటో డ్రైవర్ టి.నాగరాజు, ఆటోల ప్రయాణిస్తున్న కొంపల్లి రాంబాబు తీవ్రంగా గాయపడ్డారు. రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు.

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

మండలంలోని తూరంగి గ్రామంలోని ఒక ఇంటిలో నిల్వ చేసిన 11,335 కేజీల పిడిఎస్ బియ్యంను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సామర్లకోట మండలం వికె.రాయపురం గ్రామానికి చెందిన అమలకోట వరహాలు, తలారి వీరబాబులకు చెందిన బియ్యంగా అధికారులు గుర్తించారు. వారిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యల కోసం ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేసినట్లు సివిల్ సప్లయి డిటి మర్రి వీరాస్వామి తెలిపారు.

యానాం వార్తలు

కంచర్ల కాంప్లెక్స్‌లో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి - యానాం

యానాం బస్ కాంప్లెక్స్ రోడ్డులోని కంచర్ల కాంప్లెక్స్‌లో మంగళవారం ఉదయం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో కాంప్లెక్స్‌లోని ఎస్‌బిఐ ఎటిఎం సెంటర్, మోటారు మెకానిక్ షెడ్ ఎదురుగా ఉన్న కారుతోపాటు, 2 మోటారు సైకిళ్ళు దగ్ధమయ్యాయి. మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. తొలత ఎటిఎం నుంచే మంటలు వ్యాపించినట్టు స్థానికులు తెలిపారు. ఈ మంటలు మోటారు షెడ్ ఎదురుగా ఉన్న వాహనాలకు వ్యాపించాయి. స్థానిక ఫైర్ స్టేషన్‌కు అందిన సమాచారంతో సిబ్బంది హుటాహుటీనా సంఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ఎటిఎం సెంటర్‌తోపాటు, కారు, రెండు మోటారు సైకిళ్ళు పూర్తిగా దగ్ధం అయ్యాయని స్థానిక ఫైర్ స్టేషన్ ఎస్‌ఐ జె.మీరాసాహెబ్ తెలిపారు. అగ్ని ప్రమాదం విద్యుధాఘాతం వల్ల జరిగిందా? లేక మరేయితర కారణమా? అనేది తెలియాల్సివుంది. ఈ ప్రమాదంలో ఎటిఎం మిషన్‌లోని నగదు కాకుండా సుమారు రూ.5 లక్షలు ఆస్తినష్టం ఉంటుందని ఫైర్ అధికారులు అంచనా వేశారు.

ఘనంగా వైఎస్‌ఆర్ జయంతి

ప్రజాశక్తి - యానాం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక యానాం నల్లచెరువు సమీపంలో ఉన్న వైఎస్‌ఆర్ విగ్రహానికి ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్, ఎస్‌ఐ కట్టా సుబ్బరాజు, ట్రాఫిక్ ఎస్‌ఐ శేరు నూకరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్‌ఆర్ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అర్థాని దినేష్, నాయకులు కాటంశెట్టి రామూర్తి మాట్లాడారు.

నాయికంపల్లిలో పొలం పిలుస్తుంది

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని పి.నాయికంపల్లిలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి శ్రీరామ్ మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయాన్ని ఈనెల 18న అందించడం జరుగుతుందన్నారు. ఈనెల 13వ తేదీ లోగా ఏమన్నా గ్రీవెన్స్ ఉంటే రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని సూచించారు. పొలం గట్లపై కంది పంట సాగుకు ఉచితంగా విత్తనాలు ఇస్తామన్నారు. కౌలు రైతులకు తప్పనిసరిగా కౌలు గుర్తింపు కార్డును విఆర్‌ఒలు, గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా చేయించుకోవాలని అన్నారు. రైతులు తప్పనిసరిగా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పి.మౌళి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

టిబి వ్యాధి గుర్తింపు పరీక్షలు

ప్రజాశక్తి - పెద్దాపురం

టిబి ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక వైద్య సేవల యూనిట్ పరిధిలోని అపర్ణ టైల్స్ ఇండస్ట్రీస్ కార్మికులకు మంగళవారం టిబి వ్యాధి గుర్తింపు పరీక్షలు నిర్వహించారు. తొలుత కార్మికులకు టిబి వ్యాధిపై అవగాహన కల్పించారు. టిబిని సకాలంలో గుర్తించి వైద్య సేవలు పొందితే పూర్తిస్థాయిలో నయం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి ఆఫీసర్ డాక్టర్ ఐ.ప్రభాకర్, ఇఎస్‌ఐసి డాక్టర్లు, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ జి.వెంకటేష్, డాట్ ప్లస్ సూపర్‌వైజర్ ఆర్.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక పాత పోలీస్ స్టేషన్ వద్ద నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో మంగళవారం పేదలకు అన్నదానం చేశారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, తుమ్మలపల్లి సత్యనారాయణ భూపతి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తుమ్మలపల్లి రమేష్ అన్నదానాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి వైస్ ఛైర్మన్ బుదిరెడ్డి శ్రీనివాస్, జనసేన నాయకులు మొగిలి గంగాధర్, గోన శివ, మాధరపు వీరబాబు, కురుమళ్ళ నాగేశ్వరావు, సూరపురెడ్డి నరేష్, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

స్థానిక పిహెచ్‌సి వైద్యుల ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత, జ్వరాలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా దోమకాటు, వ్యాధుల నిర్మూలన, పరిసరాల పరిశుభ్రత, జ్వరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ సునీతమేర్సీ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు దరి చేరవన్నారు. ఆయా వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు భాషా, రజిమ్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి దత్తత స్వీకరించాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

ప్రతి ఉద్యోగి బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి సూచించారు. మంగళవారం మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో గుర్తించిన శాంతా నాగదుర్గ కుటుంబాన్ని సందర్శించారు. ఆ కుటుంబ సభ్యులతో ఏకాంతంగా సమావేశమై వారి అవసరాలు, ప్రస్తుత కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అందుతున్న ఇంటింటికీ కుళాయి, విద్యుత్తు కనెక్షన్లు, దీపం 2, రేషన్ సరుకులు, సామాజిక ఫించను సక్రమంగా అందుతున్నాయా, తల్లికి వందనం, విద్యార్థి మిత్ర కిట్లు, తదితర సంక్షేమ పథకాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం పి-4ను ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లాలో 1.02 లక్షల కుటుంబాలను పి-4 ద్వారా అభివృద్ధి చేసేందుకు గుర్తించడం జరిగిందన్నారు. అట్టడుగున ఉన్న కుటుంబాలకు సంపన్న కుటుంబాలు సాయం అందించడమే పి-4 లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఆర్‌డిఒ కె.శ్రీరమణి, జిల్లా ప్రణాళిక అధికారి పి.త్రినాథ్, బిసి కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసు, తహశీల్దార్ జెవిఆర్. రమేష్, ఎంపిడిఒ ఎవిఎస్.చంద్రశేఖర్, పంచాయితీ కార్యదర్శి గణేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జోనల్ స్కూల్ గేమ్స్

ప్రజాశక్తి - యానాం

స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న జోనల్ స్కూల్ గేమ్స్ ఉత్సాహంగా జరుగుతున్నాయి. మంగళవారం బాలుర అండర్ 14 ఫుట్ బాల్ గేమ్‌ను నిర్వహించారు. ఈ పోటీలో ఎంజిజి బాయ్స్ హైస్కూల్ విన్నర్‌గానూ, ఆర్‌జిజి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ రన్నర్‌గా నిలిచింది. మూడో స్థానంలో డాక్టర్ కెఆర్.నారాయణన్ గవర్నమెంట్ హైస్కూల్ నిలిచింది. విజేత జట్లుకు వ్యాయామ ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, ఐవికె.మోహన్ పాల్గొన్నారు.

కాలుష్య రహిత సమాజానికి మొక్కలు దోహదం

ప్రజాశక్తి - కిర్లంపూడి

కాలుష్య రహిత సమాజానికి మొక్కలు ఎంతగానో దోహదపడతాయని కిర్లంపూడి మండలం ఎంపిపి తోట రవి అన్నారు. మంగళవారం కిర్లంపూడి కొక్కొండ రామ శేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి తోట గాంధీ, ఎస్‌ఎంసి ఛైర్మన్ ఆళ్ల బాబులు, ఎంపిడిఒ బావిశెట్టి హరికృష్ణ పాల్గొన్నారు.